క్లుప్తంగా

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

కల్వకుర్తి రూరల్: మండలంలోని తాండ్రలో మంగళవారం ఆంజనేయస్వామి దేవాలయం నుంచి శివాలయం వరకు సీసీ రోడ్డు పనులను గ్రామానికి చెందిన సుధాకర్ రెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో జగన్మోహన్ రెడ్డి, శ్రీనివాస్ శర్మ, సుదర్శన్ రెడ్డి, సాయి లీల, జయసింహారెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, లింగయ్య, హనుమంతు, కిష్టయ్య, కిషన్ తదితరులు పాల్గొన్నారు.

నోట్ పుస్తకాలు పంపిణీ

బిజినేపల్లి: మండలంలోని కారుకొండ ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు మంగళవారం ప్రభుత్వం అందించిన నోట్ పుస్తకాలను పంపిణీ చేశారు. 1వ తరగతి నుంచి 5వ తరగతి వరకు అందించినట్లు హెచ్‌ఎం రామకృష్ణ, ఉపాధ్యాయులు రామృష్ణ, భాగ్యలక్ష్మి, శ్రీకాంత్, ఇంద్రాణి తదితరులు ఉన్నారు.

భూ సమస్యలు పరిష్కరించాలి

తాడూరు: మండల కేంద్రంతో పాటు గ్రామాల్లోని భూ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మంగళవారం ఇంటర్నేషనల్ ఉమెన్ రైట్స్ ఆధ్వర్యంలో తహసీల్దార్ జయంతికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా ఉపాధ్యక్షుడు కొట్ర బాలు మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూ భారతి చట్టంపై అవగాహన కల్పించాలన్నారు. రైతులు ఇచ్చిన దరఖాస్తుల ఆధారంగా సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో నాయకులు మహేష్, లక్ష్మయ్య, బీమయ్య, బంగారయ్య, పాల్గొన్నారు.

ప్రిన్సిపాల్‌గా నర్సింహులు

కందనూలు: కోడేర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల నూతన ప్రిన్సిపాల్‌గా నర్సింహులు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. మహబూబ్‌నగర్ ఒకేషనల్ జూనియర్ కళాశాలలో అధ్యాపకుడిగా పనిచేశాడు. పదోన్నతిపై ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు చేపట్టారు. అనంతరం అధ్యాపకులు, సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

ఆలయానికి రూ.1.50 లక్షల విరాళం



వెల్దండ: మండలంలోని చెర్కూర్‌లో నూతనంగా నిర్మిస్తున్న ఆంజనేయస్వామి, శివాలయాల నిర్మాణాలకు గ్రామానికి చెందిన మెండేగుత్తల వీరేశం వ్యక్తిగతంగా రూ.1.50లక్షల విరాళం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయ నిర్మాణం నాణ్యతగా చేపట్టి వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. ప్రతి ఒక్కరు భక్తిభావంతో మెలగాలన్నారు. అనంతరం ఉత్సవ కమిటీ సభ్యులకు చెక్కు అందజేశారు. కార్యక్రమంలో అల్లే సందీప్, జాజాల రామచంద్రయ్య తదితరులు ఉన్నారు.

వ్యక్తిపై కేసు నమోదు

లింగాల: మండలంలోని వల్లభాపూర్‌కు చెందిన వట్టపు వీరారావు వ్యవసాయ పొలంలో స్ప్రింకర్లు, పైపుల అపహరణలో అదే గ్రామానికి చెందిన ఈదమయ్య అనే వ్యక్తిపై మంగళవారం కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ వెంకటేశ్వర్‌గౌడు తెలిపారు. ఈ నెల 6న నాలుగు పైపులు, 2 స్ప్రింకర్లను అపహరించాడు. పొలం యజమాని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఖాతాదారుల ఆందోళన



చారకొండ: యూనియన్ బ్యాంకు మేనేజర్ రమేష్ ఖాతాదారులతో దురుసుగా వ్యవహరిస్తు ఖాతాదారుల సేవలు అందించడంలో నిర్లక్ష్యం వహిస్తున్నాడు. నిత్యం ఖాతాదారులతో ఏదో విషయంలో వివాదాలకు కారణమతున్నాడు. దీంతో ఖాతాదారులు విసుగుచెంది మండల కేంద్రంలో బ్యాంకు ఎదుట మంగళవారం ఖాతాదారులు ఆందోళన చేపట్టారు. మేనేజర్ తీరుతో రైతులు, మహిళలు, వృద్ధులు ఇబ్బందులు పడుతున్నారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తున బాంక్ మేనేజర్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.సంబంధిత బ్యాంకు ఉన్నత అధికారులు స్పందించి చర్యలు తిసుకోవాలని ఖాతాదారులు డిమాండ్ చేశారు.

అంబేడ్కర్ విగ్రహం ధ్వంసం



బిజినేపల్లి: మండలంలోని లింగసానిపల్లిలో విగ్రహ ప్రారంభోత్సవానికి సంవత్సరం కిందట ఏర్పాటు చేసిన అంబేడ్కర్ విగ్రహాన్ని సోమవారం అర్ధరాత్రి గుర్తు తెలియని దుండగులు ధ్వంసం చేశారు. చెయ్యిని విరగొట్టి కిందపడేశారు. మంగళవారం అంబేడ్కర్ కమిటీ నిర్వాహకులు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

‘ఉపాధి’లో ఉత్తుత్తి పనులు

- రోడ్డుకు ఫీటు దూరంలోనే గుంతలు
- కొరవడిన అధికారుల పర్యవేక్షణ



గుంతల్లో తేలిన కంకర



బల్మూర్-అచ్చంపేట ప్రధాన రహదారి పక్కనే అడుగు దూరంలో తీసిన గుంతలు

బల్మూర్: జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం పనుల్లో అధికారులు పారదర్శకత పాటించకుండా ఉనికి కోసం ఊగిసలాడుతున్నారు. చేసిన పనులనే మళ్లీ చేస్తూ నిధుల వృథా చేస్తున్నారు. కేవలం కూలీలతో పనులు చేయించామా మస్టర్లు వేసి టార్గెట్ పూర్తి చేశామనే ఆలోచన తప్ప చేసే పని వల్ల కలిగే ప్రయోజనం ఏమిటనీ చూడటం లేదు. మండల కేంద్రం బల్మూర్ నుంచి అచ్చంపేట ప్రధాన రహదారి ఇరువైపులా గతంలో హరితహారంలో నాటిన చెట్లు పెరిగి వృక్షాలు ఏపుగా ఉన్న కూడా మళ్లీ అక్కడే చెట్లను నాటుతూ ప్రజాధనం నిరుపయోగం చేస్తున్నారని ప్రజలు విమర్శిస్తున్నారు. వారం రోజుల నుంచి బల్మూర్-అచ్చంపేట ప్రధాన రహదారి ఇరువైపులా వనమహోత్సవంలో చెట్లను నాటేందుకు కూలీలతో గుంతలు తీయించారు. కాని తీయించిన గుంతలు కూడా బీటీ రోడ్డుకు కేవలం ఫీటు దూరంలోనే తీయగా వాటిలో మట్టికి బదులు కంకర తేలింది. దీంతో ఎదురుగా వచ్చే వాహనాలకు సైడ్ ఇవ్వడానికి కూడా వాహనాలు కిందికి దిగలేని పరిస్థితితో వాహనచోదకులు ఇబ్బందులు పడుతున్నారు. అసలే ఇరువైపులా పెద్ద వృక్షాలు ఉన్నప్పటికి పక్కనే ఉన్న కొంచెం స్థలంలోనే కూలీలతో గుంతలు తీయించారు. గుంతల్లో కంకర తేలినా అలాగే పనులు చేయించడంపై వాహనచోదకులు మండిపడుతున్నారు. ఇలాంటి పనులు నిత్యం అధికారులు తిరిగే రోడ్డుపై జరుగుతున్న వారు కూడా దీనిని పట్టించుకోక పోవడంపై పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఉపాధి హామీ పథకంలో మండలంలో ఉపయోగం లేని ఉత్తుత్తి పనులు చేస్తు నిధులు ఖర్చు చేస్తున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి.

నిబంధనలు బేఖాతార్

రోడ్లుకు ఇరువైపులా చెట్లు నాటేందుకు కూలీలతో గుంతలు తీయించడంలో ఉపాధి హామీ సిబ్బంది నిబంధనలు పాటించడం లేదు. రోడ్లుకు తొమ్మిది ఫీట్ల దూరంలో చెట్లు నాటాల్సి ఉన్న కూడా కేవలం ఫీటు దూరంలోనే గుంతలు తీయిస్తున్నారు. ఈ గుంతల్లో కూడా మట్టికి బదులు రోడ్డు ఎర్తింగ్ కంకర తేలుతుంది. దీని వల్ల నాటిన చెట్లు కూడా పెరిగే అవకాశం లేదు. దీంతో పాటు రోడ్డుపై ఎదురుగా వచ్చే వాహనాలు సైడ్ ఇవ్వడానికి కిందికి దిగే పరిస్థితి లేదు. ఇన్ని ఇబ్బందులు ఉన్న అధికారుల అలసత్వంతో ఏమాత్రం ఉపయోగం లేని అనువు కాని చోట కూలీలతో గుంతలు తీయించి అధికారులు, సిబ్బంది చేతులు దులుపుకుంటున్నారని ప్రజలు విమర్శిస్తున్నారు. ఉపాధి హామీ పథకం పనులపై ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేక పోవడంతోనే మండలంలో ఇష్టానుసారంగా చేసిన చోటే ప్రయోజనం పనులు చేస్తు ప్రజాధనాన్ని వృథా చేస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు.

డమ్మీ పనులు చేస్తున్నారు..



మండల కేంద్రం నుంచి అచ్చంపేటకు వెళ్లే ప్రధాన రహదారిపై గతంలో రెండు సార్లు హరితహారంలో చెట్లు నాటారు. అవి పెరిగి వృక్షాలుగా మారావి. కాని మళ్లీ ఇదే రహదారిపై కేవలం ఫీటు దూరంలోనే చెట్లు నాటేందుకు గుంతలు తీశారు. గుంతలు రోడ్డుకు దగ్గరగా తీయడంతో వాహనదారుల ఇబ్బందులు పడుతున్నారు. డమ్మి పనులతో ప్రజాధనాన్ని వృథా చేస్తున్నారు. ఉపాధి హామీలో ఉత్తుత్తి పనులు చేస్తున్నారు.

–తిరుపతయ్య, మాజీ ఉప సర్పంచ్, బల్మూర్

గుంతలు పరిశీలిస్తాం..

ఉన్నతాధికారుల నుంచే టార్గెట్స్ ఇస్తున్నందు వల్ల ఎక్కడ ఖాళీ స్థలం ఉంటే అక్కడే చెట్లు నాటాల్సి వస్తుంది. రోడ్డుకు దూరంగా నాటితే పొలాల రైతులు చెట్లు కాల్చేస్తున్నారు. బల్మూర్-అచ్చంపేట రూట్లో ఆర్టీసీ వారు చెట్లు నాటాలని లెటరు ఇచ్చినందున చెట్లు లేనిచోట చెట్లు నాటిస్తున్నాం. గతంలో నాటిన చోట గుంతలు తీయొద్దని సూచించారు. తీసిన గుంతలు పరిశీలించి చర్యలు తీసుకుటాం.

–సువర్ణ, ఏపీఓ, బల్మూర్

పిచ్చి మొక్కల తొలగింపు





2వ, 14వ వార్డులలో పిచ్చి మొక్కలను తొలగిస్తున్న పారిశుద్ధ్య సిబ్బంది

సాక్షి ఎఫెక్ట్..

అచ్చంపేట: అచ్చంపేట మున్సిపల్ కమిషనర్ డి. మురళితో సోమవారం నిర్వహించిన ‘సాక్షి’ఫోన్ ఇన్ కార్యక్రమానికి స్పందన లభించింది. పట్టణ ప్రజల నుంచి వచ్చిన కొన్ని ఫిర్యాదులు, సమస్యలను సోమ, మంగళవారం సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకున్నారు. మున్సిపల్ సిబ్బంది ఆయా వార్డులు, కాలనీల్లో వీధి దీపాలు, మురుగు కాల్వలు శుభ్రం, కచ్చ(మట్టి) కాల్వల వెంట మురుగు నీరుపోయే విధంగా పనులు చేయించారు. పిచ్చి, కంప చెట్లను తొలగించారు.

నేరాల నియంత్రణలో సీసీ కెమెరాలు దోహదం



అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ ఎంకటేశ్వర్‌గౌడ్

లింగాల: నేరాల నియంత్రణలో సీసీ కెమెరాలు దోహదం చేస్తాయని ఎస్‌ఐ వెంకటేశ్వర్‌గౌడు అన్నారు. మండలంలోని రాయవరంలో మంగళవారం పోలీసు శాఖ ఆధ్వర్యంలో సీసీ కెమెరాల ఏర్పాటుపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ సీసీ కెమెరాల ఏర్పాటులో ప్రజలు భాగస్వాములు కావాలన్నారు. ప్రతి గ్రామంలో ముఖ్యమైన కూడళ్లలో కెమెరాలను ఏర్పాటు చేసుకోవడం ఎంతో అవసరమని అన్నారు. నేరాలను దృష్టిలో ఉంచుకొని కెమెరాల ఏర్పాటు గురించి ప్రజలు ముందుకు రావాలని సూచించారు. అదే విధంగా సైబర్ నేరాల పట్ల ప్రతి ఒక్కరు అప్రమత్తంగా ఉండాలన్నారు. వ్యక్తిగత సమాచారం ఎవరికి చెప్పొద్దన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచు మల్లయ్య, పోలీసు సిబ్బంది బాలరాజు, ఖుద్దూస్, హుస్సేన్, గ్రామస్తులు పాల్గొన్నారు.

పశువుల చోరీ: కేసు నమోదు

చారకొండ: రెండు పశువులు చోరీకి గురైన ఘటన మండలంలోని సోమవారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. ఎస్‌ఐ శంషోద్దీన్ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని అగ్రహారం తండాకు చెందిన పసుల పద్మ, జలావత్ చాగోలికి సంబంధించి రెండు పశువులు ఆదివారం రాత్రి తమ వ్యవసాయ పొలాల్లో వేర్వేరుగా కటేట్ ఇంటికి వచ్చారు. సోమవారం ఉదయం వెళ్లి చూసేసరిగా పశువులు లేకపోవడంతో చోరీకి గురైనట్లు గుర్తించారు. దీంతో మంగళవారం బాధితులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

కమ్యూనిస్టుల పోరాటం మరిచిపోలేం



తెలకపల్లి: దేశంలో కమ్యూనిస్టుల పోరాటం చరిత్ర పుటల్లో నిలుస్తుందని. వాని పోరాటం మరచిపోలేమని సీపీఐ రాష్ట్ర సమితి కేశవులుగౌడ్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో సీపీఐ సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా కేశవులు గౌడ్ హాజరై మాట్లాడారు. బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం కృషి చేస్తున్న ఏకైక పార్టీ సీపీఐ మాత్రమేనన్నారు. పార్టీ ఆధ్వర్యంలో భూ పోరాటాలు చేశామని గుర్తు చేశారు. కల్వకుర్తి పట్టణంలో జిల్లా 3వ మహాసభలు నిర్వహిస్తునట్లు పేర్కొన్నారు. రాష్ట్ర కార్యదర్శి శాసనభ్యులు కూనంనేని సాంబశివరావు, జాతీయ సమితి సభ్యులు వెంకట్ రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు బాల్‌నర్సింహ్మా హాజరవుతారన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా కార్యదర్శి సూర్యశంకర్‌గౌడ్, జిల్లా సమితి సభ్యులు బాలమురళి కృష్ణ, రాష్ట్ర కార్యదర్శి వెనేపల్లి రవీందర్, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు అంజనేయులు, విష్ణు, నరేందర్‌రెడ్డి, సీతయ్య, బుగ్గస్వామి, బిచ్చయ్య, నిరంజన్ పాల్గొన్నారు.

వయోజన విద్య పెంపునకు చర్యలు

చారకొండ: గ్రామాల్లో వయోజన విద్యాను పెంపొందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఎంఈఓ ఝాన్సిరాణి అన్నారు. మండల కేంద్రంలోని జిల్లా ఉన్నత పాఠశాలలో మంగళవారం ఐకేపీ సంఘాల వీఓఏలకు సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ హాజరై వయోజన విద్యపై అవగాహన కల్పించారు. అనంతరం ఏపీఎం రాములు మాట్లాడుతూ వయోజన విద్యా సర్వే, సంబంధిత ఉల్లాస్ యాప్‌లో నమోదుపై శిక్షణ ఇచ్చారు. 15 సంవత్సరాల నుంచి 50 వరకు ఉన్న వారిని వయోజనులను గుర్తించి, వారిని అక్షరాశులుగా మార్చేందుకు గ్రామంలో 10 మందికి ఒక్కరిని వలంటరీగా నియమించాలని వీఓఏలకు సూచించారు. జీహెచ్‌ఎం భగవాన్ రెడ్డి, కేజీబీవీ ఎస్ఓ మంజుల, శిక్షకుడు శ్రీకాంత్ ఉన్నారు.

గోరింటాకు సంబరాలు

ఉప్పునుంతల: మండలంలోని కాంసానిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం ఆషాడ మాసంను పురస్కరించుకొని ఉపాధ్యాయునీయులతో కలిసి విద్యార్థినులు గోరింటాకు సంబరాలు నిర్వహించారు. విద్యార్థినులు స్వయంగా గోరింటాకు మెహందీని తయారు చేసుకున్నారు. గోరింటాకు విశిష్టతను ఉపాధ్యాయులు తెలిపారు.

పీఏసీఎస్‌కు నాబార్డు అవార్డు

ఉప్పునుంతల: ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం (పీఏసీఎస్)కి ఉత్తమ సొసైటీగా అవార్డు వరించింది. మంగళవారం హైదరాబాద్ ఆర్టీసీ క్రాస్‌రోడ్డులో గల నాబార్డు రీజియన్ కార్యాలయంలో 44వ నాబార్డు వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని రాష్ట్రంలో అత్యుత్తమ సేవలు అందిస్తున్న సొసైటీలకు అవార్డులను అందజేశారు. అందులో భాగంగానే సహకార, వ్యవసాయ శాఖ మంతి తుమ్మల నాగేశ్వర్‌రావు, టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు, సహకార కమిషనర్ సురేంద్రమోహన్, నాఫ్‌క్యాబ్ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు, నాబార్డు సీజీఎం ఉదయ్‌భాస్కర్ చేతులమీదుగా ఉప్పునుంతల పీఏసీఎస్ చైర్మన్ సత్తు భూపాల్‌రావు, సీఈఓ రవీందర్‌రావులు నాబార్డు అవార్డును అందుకున్నారు. ఉప్పునుంతల పీఏసీఎస్ నాబార్డు అవార్డును అందుకోవడం ఇది రెండో సారి కావడం గమనార్హం.

సమస్యల పరిష్కారానికి పోరాడుతాం

అచ్చంపేట రూరల్: జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి నిరంతరం పోరాడుతామని టీయూడబ్ల్యూజే ఐజేయూ రాష్ట్ర కార్యదర్శి మధుగౌడ్ అన్నారు. మంగళవారం శ్రీశైల ఉత్తర ముఖద్వారమైన ఉమామహేశ్వర క్షేత్రం వద్ద జిల్లా నూతన కమిటీ కార్యవర్గ సమావేశాన్ని జిల్లా అధ్యక్షుడు విజయ్‌కుమార్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జర్నలిస్టుల సమస్యలపై రాజీలేని పోరాటం చేస్తామన్నారు. జిల్లా అధ్యక్షుడు విజయకుమార్, జిల్లా కార్యదర్శి సురేష్‌కుమార్, జిల్లా మాజీ అధ్యక్షుడు గోలి సుదర్శన్‌రెడ్డి, కర్ణయ్య, జిల్లా, నియోజకవర్గ బాధ్యులు పాల్గొన్నారు.

కైలాసం గుట్టపై ధ్వజారోహణం

కల్వకుర్తి రూరల్: పట్టణ సమీపంలోని కై లాసం గుట్టపై వెలసిన శివాలయం వద్ద హిందూ ఐక్యవేదిక ఆధ్వర్యంలో మంగళవారం ధ్వజారోహణం నిర్వహించారు. ఐక్యవేదిక నాయకులు భావండ్ల మధు ధ్వజాన్ని ఎగురవేశారు. హిందువులందరూ కులాలకు అతీతంగా ఐక్యంగా మెలగాలని కోరారు. కార్యక్రమంలో లక్ష్మారెడ్డి, మహేష్ రెడ్డి, శేఖర్ రెడ్డి, మాధవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉపకారవేతనాలు చెల్లించాలని నిరసన

కొల్లాపూర్: పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్స్, ఫీరీయింబర్స్‌మెంట్ నిధులను వెంటనే విడుదల చేయాలని బీఆర్‌ఎస్‌వీ జిల్లా నాయకులు ధార శేఖర్ డిమాండ్ చేశారు. బీఆర్‌ఎస్‌వీ ఆధ్వర్యంలో మంగళవారం పట్టణంలోని ఆర్‌ఐడీ జూనియర్ కళాశాల విద్యార్థులతో కలిసి నిరసన చేపట్టారు. జయరాం, సోహైల్, అంజి, అర్జున్, తరుణ్ తదితరులు ఉన్నారు.

‘జీతాలు లేక పస్తులు ఉంటున్నాం’



ఐటీడీఏ పీఓకు సమస్య వివరిస్తున్న చెంచులు

మన్ననూర్: ఎన్‌జీఓకు సంబంధించిన సెల్‌కేర్ లిమిటెడ్‌సంస్థ 8 నెలలుగా జీతాలు ఇవ్వడం లేదని మంగళవారం ఐటీడీఏ ఇన్‌చార్జ్ పీఓ, డీఎఫ్ఓ రోహిత్‌రెడ్డితో చెంచు యువకులు వాపోయారు. సమీకృత గిరిజనాభివృద్ధి సంస్థ (ఐటీడీఏ) ప్రోత్సాహంతో మూడేళ్లుగా సెల్‌కేర్ సంస్థ ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయానికి అవసరమైన సేంద్రియ ఎరువులు, ద్రవ పదార్థాలు తయారు చేస్తున్నారు. ఐటీడీఏ పూచీకత్తుతో ఈ సంస్థలో డాక్యుమెంటేషన్‌గా రూ. 10 వేల జీతంతో తిరుపతయ్య మరో 8 మంది చెంచు యువకులు ఐసీఆర్‌పీలుగా నెలకు రూ. 7 వేల జీతం చొప్పున విధులు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో ఆకులు అలాలతో పాటూ ఆవు మూత్రం, పేడ, బెల్లం, అడవి మట్టి, వేపాకుతో బ్రహ్మాస్త్రం, నీమస్త్రం, అగ్నిస్త్రం, బీజామృతం, దశపర్ణిక కషాయం వంటి సేంద్రియ ఎరువులు తయారు చేస్తారు. తయారు చేసిన సేంద్రియ ఎరువులు, కషాయాలు అచ్చంపేట నియోజకవర్గంలోని లింగాల, బల్మూర్, అమ్రాబాద్, పదర మండల పరిధిలో వానాకాలం, యాసంగి సీజన్లలో కూరగాయల సాగుతో పాటూ తిండిగింజలు సాగు చేసుకునే రైతులకు ఇవి పంపిణీ చేయాల్సి ఉంటుంది. శ్రమించి ప్రతి నిత్యం పనులు చేస్తున్నప్పటికి జీతాలు ఇవ్వకపోవడంతో కుటుంబాల పోషణ జరగడం లేదని వాపోయారు. స్పందించిన పీఓ సంస్థ నిర్వాహకులతో మాట్లాడి న్యాయం చేస్తామని తెలిపారు. చెంచు యువకులు నిమ్మల చిన్నయ్య, లింగస్వామి, మండ్లి లింగమ్మ, కుర్మయ్య, పరశురాములు, తదితరులు పాల్గొన్నారు.

వనమహోత్సవంలో భాగస్వాములవుదాం



మొక్క నాటి నీరు పోస్తున్న ఎంపీ మల్లురవి, కలెక్టర్ బదావత్ సంతోష్, ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డి

తాడూరు: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వనమహోత్సవంలో అందరు భాగస్వాములవుదామని నాగర్‌కర్నూల్ ఎంపీ డాక్టర్ మల్లురవి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ విద్యాలయంలో వనమహోత్సవ కార్యక్రమంలో భాగంగా కలెక్టర్ బాదావత్ సంతోష్ స్థానిక ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డిలతో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పచ్చదనం పెంపొందిస్తూ భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన గాలి ఆహ్లాదకరం పర్యావరణం అందించాలనే బృహత్తర సంకల్పంతో ప్రభుత్వం ముందుకు సాగుతుందన్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ పచ్చదనం పెంపొందించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ ఏడాది జిల్లా వ్యాప్తంగా 41 లక్షల మొక్కలు నాటే యజ్ఞాన్ని నిర్దేశించుకున్నామన్నారు. నాటిన ప్రతి మొక్క బతికేలా పకడ్బందీగా సంరక్షణ చర్యలు చేపడుతున్నామన్నారు. ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డి మాట్లాడుతూ మొక్కల సంరక్షణ అందరి బాధ్యత అన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ దేవ సహాయం, అటవీ శాఖ అధికారి రోహిత్ గోపి, డీఈఓ రమేష్‌కుమార్, పర్యవేక్షణ అధికారి శోభారాణి, ప్రత్యేక అధికారి విజయ, ఎంఈఓ శ్రీనివాస్‌రెడ్డి, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలం



మాట్లాడుతున్న ఆర్.శ్రీనివాసులు

కొల్లాపూర్: ప్రజా సమస్యల పరిష్కారంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలం అయ్యాయని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఆర్.శ్రీనివాస్ అన్నారు. మంగళవారం పట్టణంలో పార్టీ ముఖ్యనాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలు అవలంభిస్తోందన్నారు. నాలుగు లేబర్‌కోడ్‌లను వెంటనే రద్దుచేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన నెరవేర్చకుండా ప్రజలను మోసం చేస్తోందని విమర్శించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఖరికి నిరసనగా ప్రజాపోరాటాలు నిర్వహిస్తామన్నారు. సమావేశంలో సీపీఎం మండల కార్యదర్శి శివవర్మ, నాయకులు సలీం, తారాసింగ్, బాలపీరు, రాజు, లలిత, మధు, సురేష్ తదితరులు ఉన్నారు.

ఉపాధ్యాయ జేఏసీ ఏర్పాటు

కందనూలు: నాగర్‌కర్నూల్ జిల్లా ఉపాధ్యాయ నూతన జేఏసీని మంగళవారం ఏర్పాటు చేశారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ప్రైవేట్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో జిల్లా ఆర్గనైజింగ్ కన్వీనర్ విజయకుమార్ మాట్లాడారు. 25 ఉపాధ్యాయ సంఘాల భాగస్వామ్యంతో నూతన జేఏసీని ఏర్పాటు చేశామన్నారు. ఉపాధ్యాయ జేఏసీ జిల్లా చైర్మన్‌గా సత్యనారాయణరెడ్డి, గౌరవ చైర్మన్‌గా శ్రీనివాస్‌రెడ్డి, జనరల్ సెక్రటరీగా శ్రీధర్‌శర్మలను, అలాగే జిల్లా ఉపాధ్యక్షులను, కోశాధికారులను, జిల్లా కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వివిధ ఉపాధ్యాయ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ప్లేట్లు, గ్లాసుల పంపిణీ

కోడేరు: మండల కేంద్రంలోని మాడల్ స్కూల్ 6, 7వ తరగతి చదువుతున్న 100 మంది విద్యార్థులకు ప్లేట్లు, గ్లాసులు పంపిణీ చేసినట్లు పిన్సిపాల్ రాఘువేంద్ర తెలిపారు. అదే విధంగా వరల్డ్ యూత్ స్కీం సందర్భంగా మంగళవారం విద్యార్థులకు డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో రాఘవేంద్రశర్మ, శ్రీనివాసచారి, ఆంజనేయులు, పద్మ, శ్రీవల్లి, రాణి, రవి, సురేందర్, భవాన్ని సాయిప్రసన్న, పుష్ప, రాధ తదితరులు పాల్గొన్నారు.

అగ్నిమాపక అధికారికి వినతి

నాగర్‌కర్నూల్ రూరల్: ఫైర్ సేఫ్టి లేని ఆస్పత్రులు, పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని మంగళవారం అగ్నిమాపక జిల్లా అధికారి గిరిధర్‌కు కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు అశోక్ వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పుట్టగొడుగుల్లా ఆస్పత్రులు, పాఠశాలలు పుట్టుకొస్తున్నాయని ఫైర్‌సేఫ్టి లేకున్నా ముడుపులకు ఆశపడి జిల్లా వైద్య, విద్య అధికారులు అనుమతులు ఇస్తున్నారని ఆరోపించారు. జిల్లా కేంద్రంలోని ఏ ఒక్క ఆస్పత్రికి, పాఠశాలకు ఫైర్ సేఫ్టి ఎన్‌ఓసీ లేదని వివరించారు. నవీన్, అంజనేయులు పాల్గొన్నారు.

ఖాతాల్లో డబ్బులు మాయం

అచ్చంపేట రూరల్: గ్రామీణ ప్రాంతంలో పని చేసే ఓ బ్యాంకు మిత్ర ఖాతాదారుల ఖాతాల్లో డబ్బులు మాయం చేసిన ఉదంతం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని సింగారం గ్రామానికి చెందిన కె. ఎల్లమ్మ 2021 సంవత్సరంలో అనారోగ్యంతో మృతి చెందింది. ఆమె బతికున్న సమయంలో అచ్చంపేట ఎస్‌బీఐ బ్యాంకు తరుపున బ్యాంకుమిత్రగా ఉన్న ఉప్పునుంతల మండలం ఆవులోనిబావికి చెందిన ఓ వ్యక్తి ఆమె ఫింగర్‌ప్రింట్ బదులు అతడిది మార్చుకున్నాడు. ఎల్లమ్మ మరణించాక 2021 నుంచి ఆమె ఖాతాల్లో జమ అయిన ఫించన్ డబ్బులు, రైతుభరోసా డబ్బులు, ఇతర డబ్బులు సుమారు రూ. లక్ష వరకు బ్యాంకు మిత్ర కాజేసినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఇటీవల సింగారం పంచాయతీ కార్యదర్శి మంజుల చేపట్టిన పింఛనుదారుల అనర్హుల ఏరివేత సర్వేలో ఈ విషయం బయటపడింది. అలాగే మరికొంత ఖాతాదారుల నుంచి వారికి అనుమానం రాకుండా డబ్బులు కాజేసినట్లు తెలిసింది. ఈ విషయం బయటకు పొక్కకుండా బ్యాంకుమిత్ర తరుపున కొందరు జాగ్రత్తలు తీసుకున్నారు. ఈ విషయమై బ్యాంకు మేనేజర్ హుస్సేన్‌బాషను వివరణ కోరగా... విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ప్రభుత్వ భూమిని కాపాడాలి



అచ్చంపేట రూరల్: కబ్జాకు గురైన ప్రభుత్వ భూమిని కాపాడాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మంగ్యానాయక్ డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలోని ఆర్డీఓ కార్యాలయం ఎదుట బీజేపీ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. అనంతరం ఆర్డీఓ మాధవికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మంగ్యానాయక్ మాట్లాడుతూ పట్టణంలోని సర్వేనెంబర్ 293లో 4.32 గుంటల భూమిని కబ్జా చేసిన వారి నుంచి స్వాధీనం చేసుకోవాలన్నారు. బీజేపీ నాయకులు రేణయ్య, బాలాజీ, జానకి, నాగరాజు, రామచంద్రయ్య, పత్యానాయక్, శ్రీనివాస్‌గౌడ్, రవీందర్ పాల్గొన్నారు.

విద్యా ప్రాధాన్యంపై అవగాహన

వెల్దండ: మహిళ సంఘాలల్లోని సభ్యులందరికి విద్య నేర్పించాలని ఇన్‌చార్జ్ ఎంఈఓ చంద్రుడు పేర్కొన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉల్లాస్ ప్రోగ్రామ్ ద్వారా మహిళ సంఘాల వీఓఏలకు, ఆయా పాఠశాలల హెచ్‌ఎంలకు విద్యా ప్రాధాన్యంపై అవగాహన కల్పించారు. గ్రామాల్లోని మహిళ సంఘాల్లోని ఎంత మందికి చదువు వస్తుందో నివేదికను అందించాలన్నారు. విద్య రానివారిని గుర్తించి ప్రత్యేక శిక్షణ అందిస్తామన్నారు. కనీసం రాయడం, చదవడం మహిళలు నేర్చుకునే విధంగా విద్యను నేర్పించాలని సూచించారు. అనంతరం సలహాలు, సూచనలు అందజేశారు. కార్యక్రమంలో శిక్షకులు రాఘవేందర్, హెచ్‌ఎం రవీందర్, సీసీ గెల్వమ్మ, రాము, హెచ్‌ఎంలు, వీఓఏలు తదితరులు ఉన్నారు.

డ్రంకెన్‌డ్రైవ్‌లో ఒకరికి జైలు శిక్ష

నాగర్‌కర్నూల్ క్రైం: డ్రంకెన్‌డ్రైవ్‌లో పట్టుబడిన వ్యక్తికి న్యాయమూర్తి జైలు శిక్ష విధించినట్లు ఎస్‌ఐ గోవర్ధన్ తెలిపారు. ఎస్‌ఐ తెలిపిన వివరాల ప్రకారం తెలకపల్లి మండలం నడిగడ్డ గ్రామానికి చెందిన ముత్యాలు డ్రంకెన్‌డ్రైవ్‌లో పట్టుబడ్డాడు. ముత్యాలును మంగళవారం ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ శృతిదూత ఎదుట హాజరు పర్చగా రెండు రోజుల జైలు శిక్ష, రూ. 200 జరిమానా విధించినట్లు తెలిపారు.

వడ్డీలేని రుణాలు జమ

తెలకపల్లి: మహిళా సంఘాలకు వడ్డీలేని రుణాలను జమ చేసిందని ఐకేపీ ఏపీఎం చంద్రయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏప్రిల్ 1, 2024, సెప్టెంబర్ 30, 2024 వరకు 6 నెలలకు సంబంధించిన వడ్డీలేని రుణాలను మహిళ సంఘాల పొదుపు ఖాతాలో ఈనెల 14న మహిళా సంఘాల ఖాతాలో జమ చేశారని తెలిపారు. మండలంలోని 32 గ్రామ సంఘంలోని 552 స్వయం సంఘాలకు రూ.66.35 లక్షలు ఆయా సంఘాలకు జమ చేసినట్లు పేర్కొన్నారు.

పర్మిట్ ఒక చోట.. డంప్ మరోచోట

అచ్చంపేట రూరల్: పర్మిట్‌లో అనుమతి ఒక చోట పొంది మరో చోట ఇసుక డంప్ చేస్తున్న సంఘటన అచ్చంపేట పట్టణంలో మంగళవారం చోటు చేసుకుంది. యథేచ్ఛగా ఇసుక అక్రమ దందా కొనసాగిస్తున్నారు. ఇళ్ల నిర్మాణం, సీసీ రోడ్ల నిర్మాణం పేరుతో ఒక చోటకు అనుమతి పొంది ఇసుకను దారిమళ్లిస్తున్నారు. మంగళవారం అచ్చంపేట తహసీల్దార్ సైదులు అక్రమంగా అనుమతి లేని చోట ఇసుకను డంప్ చేస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకున్నారు. లింగాల మండలం జీలుగపల్లికి అనుమతి ఉండగా... అచ్చంపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల సమీపంలో ఇసుకను ట్రాక్టర్ డంప్ చేయడాన్ని గమనించారు. ట్రాక్టర్ యజమానికి జరిమానా విధించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఇసుక అక్రమ రవాణాను అరికట్టడంలో భాగంగా ఇసుక ట్రాక్టర్ రవాణాపై గట్టి నిఘా పెట్టామని అచ్చంపేట తహసీల్దార్ సైదులు తెలిపారు. అనుమతి ఉన్న చోటకే ఇసుకను తరలించాలన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.